మిగిలిపోయారు. ఆమెకు ఇతను పెళ్ళి చేయాలి, సహాయం చెయ్యండి'' సం. గ్రామాధికారి. ఇలా కొన్నివందల కరపత్రాలు.

అయితే ఇదన్నమాట వీడి వ్యాపారం! తెలుగురాని ప్రాంతం. మూగవాడు కాబట్టి ఎవరూ ఏమీ అడగరు. సెంటిమెంటల్ ఎటాక్, బాగానే వుంది. తెల్లారి ఉదయం

"మిత్రమా. నన్నుక్షమించు రాత్రి నీకు అబద్ధం చెప్పాను''

"కేరే ఆన్, మైడియర్ ఫ్రెండ్. నాకు ఇంకేం చెప్పొద్దు'' అన్నాను నా గుండెల్లో లావా పొంగుతోంది. కొన్ని క్షణాల్లో అతనిపై జాలి, నా కడుపులోంచి దుఃఖం వెల్లువలా నా కళ్ళలోకి చొచ్చుకురాకుండానే వెను దిరిగిపోయాను.

—o—

# వృత్తి విద్య

నేను ఆఫీసుకి వెళ్ళడానికి వాడుకగా వచ్చే రిక్షా రాముడు ఓ రోజు ఓ పదిహేనేళ్ళ కుర్రాడ్ని తీసుకొచ్చాడు. 'బాబూ మా బుడ్డోడు పదో తరగతి పాసయ్యేడు' అని చూపించాడు. నమస్కారం సార్ అన్నాడు ఆ అబ్బాయి వినయంగా. ఇద్దరి మొహాల్లోనూ సంతోషం. "వెరీగుడ్. ఇంద'' అని చొక్కా జేబుకి ఉన్న ఖరీదైన పెన్ను తీసి ఆ అబ్బాయికిచ్చేను, డబ్బిస్తే చిన్నబుచ్చుకుంటాడేమోనని. 'థాంక్యూ సార్' అన్నాడా అబ్బాయి, మొహమాటంగా అందుకుంటూ.

"కాలేజీలో చేరుత్తన్నాను బాబూ ఆడ్ని'' చెప్పాడు రాముడు మర్నాడు. 'అలాగా సంతోషం' అన్నాను. ముందు ముందు చదువు 'కొనాలన్న' సంగతి వాడికి తెలియదు అనుకున్నాను మనసులో.

కొన్నేళ్ళకి నేను సినియర్ ఆడిటర్‌ని అయ్యాను. రిక్షారాముడి కొడుకు రిక్షాతో వచ్చాడు. "అదేమిటి నువ్వొచ్చావ్? కాలేజీకి వెళ్ళటం

లేదా?" అన్నాను ఆశ్చర్యంగా. "ఈ రోజు మా నాన్నకి ఒంట్లో బాలేదు సార్. డబ్బులు పోకూడదు గదా" అంటూ నన్ను రిక్షాలో తీసుకెళ్ళాడు. దార్లో వాడి సహాధ్యాయుల చూపులకి వాడి ముఖం చిన్న బోవటం గమనించేను.

మర్నాడు రిక్షా రాముడుతో "అదేంటోయ్ చదువుకుంటున్న వాడ్ని రిక్షా తొక్కించావ్" అంటే "బాబయ్య మనిషన్నాక పని చేయడానికి సిగ్గెందుకు పడాల" అన్నాడు జ్ఞానిలా.

మరి కొన్నాళ్ళకు నేను అకౌంట్స్ ఆఫీసరనయ్యాను. ఆ రోజు రిక్షా రాముడి కొడుకు వచ్చాడు రిక్షాతో. మాసిన బట్టలు వేసుకున్నాడు.

"అదేంటోయ్. డిగ్రీ పరీక్షలు రాశావు కదా. ఇదేం పని?" అన్నాను.

"తప్పేముంది సార్ మా నాన్న ఇక రిక్షా తొక్కలేడు. ఆయ న్నింక కష్టపెట్టలేను. ఏదైనా ఉద్యోగం వచ్చేదాకా రోజుగడవాలి కదా. మా నాన్న నాకు చదువుతో పాటు వృత్తి విద్య కూడా నేర్పిం చాడు. రిక్షా తొక్కడం వృత్తి. నన్ను నేను తెలుసుకునేందుకు చదువు". ఈ మాటలు అంటున్న వాడి ముఖంలో చిరునవ్వే ఉంది. ఎక్కడా న్యూనతా భావం లేకపోవడం చూసి తృప్తిగా నిట్టూర్చాను. వాడి ముఖంలో ఆ చిరునవ్వు నిరుద్యోగుల పాలిటి వెలుగులా ఉంది. నిజమే కదా. సర్కారు చెప్పించలేని వృత్తి విద్య రిక్షా రాముడు చెప్పించాడు వాడి కొడుక్కి.

—o—